సాక్షి
శ్రీకాకుళం

శనివారం । 17 । ఆగస్టు । 2024



ఫిర్యాదు చేద్దామా..

సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. దీనిపై ఫిర్యాదు చేయడమే ప్రధానం.

- 8లో

జిల్లా ఏఎస్పీగా ప్రభాకర్‌బాబు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా ఏఎస్పీ (అడ్మిన్) గా టీటీ ప్రభాకర్‌బాబు బదిలీపై రానున్నారు. మంగళగిరి డీజీపీ కార్యాలయం నుంచి ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు వచ్చాయి. ప్రస్తుతం పనిచేస్తున్న అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్ విశాఖపట్నం సీఐడీకి ఏఎస్పీగా బదిలీపై వెళ్లనున్నారు. శ్రీకాకుళం జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జేడీ(ఏఎస్పీ) ఎ.సురేష్‌బాబుకు బదిలీ జరిగింది. ఈయనను హెడ్ క్వార్టర్స్‌కు రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

నేడు శంకర్ ఫౌండేషన్‌లో సేవలు బంద్

అరసవల్లి: పశ్చిమ బెంగాల్‌లో వైద్యురాలిపై హత్యకు నిరసనగా.. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఆలిండియా ఆప్తమాలిక్ సొసైటీ పిలుపు మేరకు శనివారం రోజంతా (24 గంటలు) స్థానిక శంకర్ ఫౌండేషన్‌లో కంటి వైద్య సేవలను నిలిపివేస్తున్నట్లుగా సంస్థ డిప్యూటీ జీఎం బంగార్రాజు ప్రకటనలో తెలియజేశారు. ఇలాగే విశాఖపట్నంలో మధురవాడ, మద్దిలపాలెం, గాజువాకల్లో ఉన్న శంకర్ ఫౌండేషన్‌లో కూడా శనివారం సేవలు నిలిపివేస్తున్నట్లుగా ప్రకటించారు.

న్యూస్‌రీల్

జాతీయ వాలీబాల్ శిక్షణ కేంద్రానికి సత్యం ఎంపిక



మైలపల్లి సత్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: భారత క్రీడా ప్రాధికార సంస్థ(సాయ్) నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీకి శ్రీకాకుళం జిల్లాకు చెందిన వాలీబాల్ క్రీడాకారుడు మైలపల్లి సత్యం ఎంపికయ్యాడు. బెంగళూరు వేదికగా పనిచేస్తున్న జాతీయ వాలీబాల్ శిక్షణ కేంద్రానికి ఈ యువకుడు ఎంపికయ్యాడు. దేశం మొత్తం మీద కేవలం 20 మందిని మాత్రమే ఇక్కడకు ఎంపిక చేశారు. సత్యం గత ఏడాది రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా శాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర' పోటీల్లో ఉత్తమ క్రీడాకారుడిగా ఎంపికై రూ.10 లక్షల నగదు పురస్కారం కూడా అందుకున్న విషయం తెలిసిందే. గత మూడేళ్లుగా శ్రీకాకుళం కేఆర్ స్టేడియం ప్రాంగణంలో శాప్ వాలీబాల్ కోచ్ కళ్లేపల్లి హరికృష్ణ పర్యవేక్షణలో ఈ యువ క్రీడాకారుడు కఠోర సాధన చేస్తూ ముందుకు సాగుతున్నాడు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఇచ్ఛాపురం క్రీడాకారులు



జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు పయనమైన క్రీడాకారులతో కోచ్ దుర్గాప్రసాద్

ఇచ్ఛాపురం: కోల్‌కతాలోని రైఫిల్ ఫ్యాక్టరీ ఇండోర్ స్టేడియంలో నేటి నుంచి 19వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి ఓపెన్ నేషనల్ తైక్వాండో పోటీలకు ఇచ్ఛాపురం నుంచి 19 మంది క్రీడాకారులు హాజరవుతున్నారని తైక్వాండో కోచ్ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు స్కూల్ ఆఫ్ తైక్వాండో, ఇచ్ఛాపురం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి పోటీలకు సిద్ధమైన క్రీడాకారులకు శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు, క్రీడాకారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జెమ్స్‌లో అవయవదానం



కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్, వైద్యులు ఇన్‌సెట్‌లో భాస్కరరావు (ఫైల్)

శ్రీకాకుళం రూరల్: రాగోలు జెమ్స్ ఆస్పత్రి మరోసారి అవయవదాన క్రతువుకు వేదికగా నిలిచింది. లావేరు మండలం అదపాక గ్రామానికి చెందిన దుక్క భాస్కరరావు(22) డిగ్రీ చదువుతూ పెయింటింగ్ పనులకు వెళ్లేవాడు. ఈ నెల 14వ తేదీన పెయింటింగ్ వర్క్ చేస్తూ దురదృష్టవశాత్తు ఎత్తులో నుంచి కిందకి పడిపోయాడు. అదే రోజు వైద్యం కోసం జెమ్స్ ఆస్పత్రికి తీసుకురాగా వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి, ఈ నెల 15వ భాస్కరరావు బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించారు. ఈ విషయం జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధులకు తెలియడంతో వారు మృతుడి కుటుంబ సభ్యులను అవయవదానానికి ఒప్పించారు. దీంతో శుక్రవారం దుక్క భాస్కరరావు రెండు కిడ్నీలలో ఒక దాన్ని జెమ్స్ ఆస్పత్రికి, మరో దాన్ని విశాఖపట్నం ఆస్పత్రికి తరలించారు. లివర్‌ను విశాఖపట్నం కిమ్స్ ఆస్పత్రికి పంపించారు. శుక్రవారం భాస్కరరావు మృతదేహానికి పూలమాలలతో ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులు, ఎంబీబీఎస్, నర్సింగ్ విద్యార్థులు ఘన నివాళులు అర్పించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మృతుడి కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ సుధీర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసు, క్రిటికల్ కేర్ డాక్టర్ శివాన్వేష్, జనరల్ మేనేజర్లు ప్రవీణ్, జ్యోత్స్న పాల్గొన్నారు.

తమ్ముళ్ల ఆకలి తీర్చిన అన్న క్యాంటీన్లు

చంద్రబాబు పాలనలో..



శ్రీకాకుళం ఏడు రోడ్ల జంక్షన్‌లో ఉన్న అన్న క్యాంటీన్ భవనమిది. 2018లో టీడీపీ ప్రభుత్వం సుమారు రూ.37.55 లక్షల అంచనా వ్యయంతో నిర్మించింది. ఇప్పుడు మరో రూ.20 లక్షలు ఖర్చు పెట్టింది. దీనికి అయిన మొత్తం ఖర్చు రూ.57.55 లక్షలు.

శ్రీకాకుళం రూరల్‌లోని చాపురంలో వైఎస్ జగన్ ప్రభుత్వంలో నిర్మించిన సచివాలయం భవనమిది. గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణానికి రూ.40లక్షలు ఖర్చయ్యింది. అన్ని హంగులతో నిర్మించిన భవనమిది.

వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో..



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

ఈ లెక్కల్లో తేడాలు అన్న క్యాంటీన్ల ముసుగులో టీడీపీ చేస్తున్న అవినీతిని తేటతెల్లం చేస్తున్నాయి. వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.25 లక్షల నుంచి రూ.40 లక్షల వ్యయంతో గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్‌తో సచివాలయాల భవనాలు నిర్మించగా, అదే టీడీపీ ప్రభుత్వంలో కేవలం గ్రౌండ్ ఫ్లోర్‌తో ఉన్న భవనానికి రూ.37.55 లక్షల ఖర్చు చేసింది. అది కూడా 2018లో నిర్మించింది. అప్పుడున్న మెటీరియల్ విలువకు, వైఎస్ జగన్ ప్రభుత్వం ఉన్న కాలంలో మెటీరియల్ విలువకు సహజంగా తేడా ఉంటుంది. అయినా ప్రజా ధనమే కదా అని టీడీపీ నాయకులు అంతలా ఖర్చు చేశారు. పైగా టీడీపీ నాయకులే కాంట్రాక్టర్ల అవతారమెత్తి దొరికినకాడికి దోచుకున్నారు.

మెరుగుల పేరుతో మళ్లీ..

గతంలో నిర్మించిన అన్న క్యాంటీన్ భవనాలకు రంగులద్దడానికి టీడీపీ నాయకులే కాంట్రాక్టర్ల అవతారమెత్తారు. చిన్నపాటి మరమ్మతులతో పాటు కొత్తగా బొమ్మలు వేయడానికి ఒక్కో అన్న క్యాంటీన్‌కు రూ.10 లక్షల నుంచి రూ.20లక్షల వరకు ఖర్చు పెట్టారు. దీంతో ఇది కేవలం పార్టీ నాయకులను పోషించడానికి చేస్తున్న కార్యక్రమమని స్పష్టమైపోయింది.

సచివాలయం ఉద్యోగులను వెళ్లగొట్టి..

అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు సచివాలయ ఉద్యోగులను బయటికి పంపించడం ఆక్షేపణకు తావిచ్చింది. శ్రీకాకుళం పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద సిద్ధం చేసిన అన్న క్యాంటీన్‌లో గతంలో సచివాలయం నడిచేది. ఈ ప్రభుత్వం వచ్చాక సచివాలయం ఉద్యోగులను బయటికి పంపించేసి, అందులో ఉన్న కంప్యూటర్లను కార్పొరేషన్ కార్యాలయంలో పడేసి, సచివాలయం కోసం అద్దెకు మరో భవనం వెతికే బాధ్యతను మళ్లీ ఆ ఉద్యోగులకే అప్పగించి ఇక్కడ అన్న క్యాంటీన్ పెట్టారు. సెవెన్‌రోడ్ జంక్షన్‌కు, పొట్టి శ్రీరాములు జంక్షన్‌కు అరకిలోమీటరైనా దూరం ఉండదు. ఈ కాస్త దూరానికి రెండు క్యాంటీన్లు పెట్టడం కూడా చర్చనీయాంశమవుతోంది. డే అండ్ నైట్ జంక్షన్ వద్దో....జిల్లా నలుమూలల నుంచి వచ్చే రోగులకు, వారి సహాయకులకు ఉప యోగపడేలా రిమ్స్ ఆస్పత్రివద్ద ఏర్పాటుచేస్తే బాగుండేదని చాలా మంది అభిప్రాయపడుతున్నారు.

జనసైనికుల్లో ఆవేదన

అన్న క్యాంటీన్లకు డొక్కా సీతమ్మ పేరు పెట్టాలని జనసేన అధ్యక్షుడు, ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనుకున్నారు. ఎన్నికలకు ముందు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. కానీ అధికారంలోకి వచ్చాక పవన్ కల్యాణ్ మాట చెల్లుబాటు కాలేదు. దీంతో పాటు అన్న క్యాంటీన్ భవనాల వద్ద ఎన్టీఆర్, చంద్రబాబు ఫొటోలు మాత్రమే పెట్టారు. ఇప్పుడిదే జనసైనికులను తీవ్ర ఆవేదనకు గురి చేసింది.

అన్న క్యాంటీన్‌ల ముసుగులో టీడీపీ దోపిడీ

- గ్రౌండ్ ఫ్లోర్‌కే పరిమితమైన అన్న క్యాంటీన్ భవనాలకు భారీగా వ్యయం
- 2018లో నగటున రూ.37.55లక్షల ఖర్చు
- మెరుగులు దిద్దేందుకు ఇప్పుడు రూ.10లక్షల నుంచి రూ.20లక్షల వరకు ఖర్చు
- కళ్ల ముందే కనిపిస్తున్న అవినీతి

సాక్షి ఫోకస్



పలాసలోని పాతబస్టాండ్ వద్ద నిర్మించిన అన్న క్యాంటీన్ బిల్డింగ్ ఇది. 2018లో రూ.37.55 లక్షలు ఖర్చు పెట్టారు. ఇప్పుడు మరో రూ.13 లక్షలు వెచ్చించారు. మొత్తం రూ.50.55లక్షల వ్యయమైంది.



పలాస మండలంలోని తర్లాకోటలో వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్మించిన సచివాలయం భవనమిది. గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ కలిపి దీన్ని కేవలం రూ.25లక్షలతో నిర్మించారు.

శ్రీకాకుళం పాత బస్టాండ్ పొట్టి శ్రీరాముల విగ్రహం జంక్షన్‌లో నిర్మించిన అన్న క్యాంటీన్ ఇది. 2018లో దీనికోసమే రూ.37.55 లక్షలు ఖర్చు పెట్టారు. ఇప్పుడు మెరుగుల కోసం మరో రూ.10 లక్షలు పెట్టారు. మొత్తం రూ.47.55 లక్షలు ఖర్చయ్యింది.



శ్రీకాకుళం రూరల్‌లోని సింగుపురంలో వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్మించిన సచివాలయ భవనమిది. అప్పటికే చిన్నగా ఉన్న భవనం స్థానంలో గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ నిర్మించారు. అంతా కలిసి రూ.25 లక్షలతో భవనం చేతికి వచ్చేసింది.



ఇచ్ఛాపురం మున్సిపల్ పరిధిలోని గాంధీ పార్క్ ఆవరణలోని అన్న క్యాంటీన్ భవనమిది. 2018లో ఉన్న టీడీపీ ప్రభుత్వం రూ. 37.55 లక్షలు వ్యయంతో నిర్మించింది. ఇప్పుడీ భవనానికి మెరుగులు దిద్దడానికి మరో రూ.13.80లక్షలు ఖర్చు పెడుతోంది. మొత్తం వ్యయం రూ.51.35 లక్షలు.





ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టిలో వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్మించిన సచివాలయం భవనమిది. అన్ని హంగులూ కలిపి రూ.40 లక్షలు మాత్రమే ఖర్చయ్యింది.

విభిన్న ప్రతిభావంతులకు 'స్వాభిమాన్' ప్రారంభం





దివ్యాంగుడితో ర్యాంపుని ప్రారంభింపజేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ (ఇన్‌సెట్లో) ఫిర్యాదు చేసేందుకు వస్తున్న దివ్యాంగుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగులు ఎండులోనూ తీసిపోరని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో గల గ్రీవెన్స్‌హాల్‌లో శుక్రవారం విభిన్న ప్రతిభావంతుల వినతుల స్వీకరణ 'స్వాభిమాన్' కార్యక్రమాన్ని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి కలెక్టరేట్‌కు వస్తున్న దివ్యాంగుల కోసం ర్యాంపును కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేశారు. కలెక్టర్, జేసీతో పాటు దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రత్నాల శ్రీనివాసరావు రిబ్బన్ కట్ చేసి ర్యాంప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులు తమ సమస్యలను విన్నవించుకున్నారు. శ్రీకాకుళం మండలానికి చెందిన మట్ట నీలం జిల్లాకి అంధుల పాఠశాల, దివ్యాంగులకు జిల్లా ప్రధాన కేంద్రంలో దివ్యాంగులు హోమ్ కావాలని కోరారు. మొత్తం 46 వినతులు వచ్చాయి. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్రతి నెల మూడో శుక్రవారం దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. వారు ఆర్టీసీ బస్సుల్లో సులువుగా ప్రయాణించేందుకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ అప్పారావు, డీపీఓ వెంకటేశ్వర్ రావు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి కిరణ్ కుమార్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్, ఏఐఈఈ రాజు, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ షకీలా, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ బి.మీనాక్షి, సీపీఓ ప్రసన్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఈఏపీ సెట్ చివరి విడత కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ఈఏపీసెట్ -2024 ఎంపీసీ స్ట్రీమ్ చివరి విడత (మూడో విడత) కౌన్సెలింగ్‌కు ఉన్నత విద్యా మండలి, సాంకేతిక విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటికే రెండు విడతల కౌన్సెలింగ్ పూర్తి చేశారు. విద్యార్థులకు మూడో కౌన్సెలింగ్‌లో మరో అవకాశం కల్పిస్తున్నారు. ఏపీఈఏపీ సెట్ ర్యాంకు వచ్చి గతంలో కౌన్సెలింగ్‌కు హాజరు కాని విద్యార్థులకు మరో అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం కళాశాలల్లో సీటు లభించిన విద్యార్థులకు కళాశాల, బ్రాంచ్ మార్చుకునే అవకాశం లభిస్తుంది. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్, సహాయ కేంద్రం సమన్వయకర్త గురుగుబెల్లి దామోదర్‌రావు తెలిపారు. కౌన్సెలింగ్‌లో సమస్యలు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో సమస్యలు ఉంటే సంప్రదించాలని సూచించారు. షెడ్యూల్ మేరకు ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ ఆన్‌లైన్ వెరిఫికేషన్, 22 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం, 23న ఆప్షన్ల మార్పు, 26న అలాట్‌మెంట్‌ల ప్రకటన, 30లోపు కళాశాలలకు సెల్ఫ్ రిపోర్టు చేయాల్సి ఉంటుంది. జిల్లాలో నాలుగు ఇంజినీరింగ్ కాలేజీలు ఉండగా, మొత్తం సీట్లు 2154 కాగా, 1903 ప్రవేశాలు జరిగాయి. 252 సీట్లు ఖాళీలు ఉన్నాయి. ప్రైవేట్ కళాశాలల్లో 30 శాతం సీట్లకు మేనేజ్‌మెంట్ పద్ధతిలో ప్రవేశాలు కల్పిస్తారు.

వైద్య విద్యార్థుల ఆందోళన ఉద్ధృతం



రిమ్స్ వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్ల మానవహారం

శ్రీకాకుళం: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ శ్రీకాకుళం రిమ్స్ వైద్య విద్యార్థులు గత ఐదు రోజులుగా చేస్తున్న ఆందోళన శుక్రవారం మరింత ఉద్ధృతమైంది. ఇప్పటివరకు ఆందోళనలు చేస్తూ విధులకు హాజరవుతున్న జూనియర్ డాక్టర్లు శుక్రవారం అత్యవసర సేవలను బహిష్కరించారు. వైద్య విద్యార్థులు తరగతులను బహిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ విచారణ జరిపేంత వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని నినాదాలు చేస్తూ రిమ్స్ కళాశాల ఆవరణలోనే దీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం మానవహారం నిర్వహించారు. రిమ్స్ ఆవరణలో భారతదేశ చిత్రపటం తరహాలో విద్యార్థులు నిలుచుని కొవ్వొత్తులు చేతపట్టి హత్యాచారానికి సంబంధించి పెయింటింగ్ చిత్రాన్ని ప్రదర్శించారు.

నేడు అత్యవసర సేవలు మాత్రమే..

శ్రీకాకుళం: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతా వైద్య కళాశాలలో వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి నిరసనగా వైద్య విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు ఇండియన్ మెడికల్ అసోసియన్(ఐఎంఏ) మద్దతు తెలిపింది. శనివారం ఉదయం ఆరుగంటల నుంచి ఆదివారం ఉదయం ఆరు గంటల వరకు అన్ని ప్రైవేటు ఆస్పత్రులు, ప్రైవేటు క్లినిక్‌లలో సాధారణ వైద్య సేవలకు దూరంగా ఉండాలని నిశ్చయించారు. ప్రజల ప్రాణాలకు ఇబ్బంది కలగకుండా అత్యవసర సేవలకు మాత్రం హాజరు కావాలని నిర్ణయించుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా ఉదయం 9 నుంచి 10 గంటల వరకు గంటపాటు విధులకు హాజరు కాకూడదని ప్రభుత్వ వైద్యుల సంఘం నిర్ణయించింది. ప్రజలు శనివారం ఓపీ కోసం రావద్దని వైద్యులు కోరారు.

'వికసిత్ భారత్ లక్ష్యం'

శ్రీకాకుళం పాతబస్టాండ్: 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌గా ఉండాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి ఆయన జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లక్ష్యానికి అనుగుణంగా 2047 నాటికి వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా అధికారులు పని చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రైవేటు ప్రజల భాగస్వామ్యంతో మౌలిక వసతుల నిర్మాణాలు జరుగుతాయని తెలిపారు. పేదరిక నిర్మూలన చేస్తూ సంపన్న పేద వర్గాల మధ్య అంతరాన్ని తగ్గించడం జరుగుతుందని వివరించారు.



సోంపేట: శాకంబరిగా సోమపోలమాంబదేవి



సోంపేట: పసుపు కొమ్ముల అలంకరణలో వాసవి కన్యకా పరమేశ్వరి



శ్రీకాకుళం కల్చరల్: గజలక్ష్మిగా విజయదుర్గ



శ్రీకాకుళం కల్చరల్: బలగలో 118 పిండి వంటలతో నైవేద్యం



సారవకోట: అవలింగిలో అమ్మవారికి నోట్లతో అలంకరణ

శ్రావణ లక్ష్మీ నమోస్తుతే..

పవిత్ర శ్రావణ శుక్రవారం రోజున అమ్మవార్లను అపురూపంగా అలంకరించారు. ఊరూవాడల్లో వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా నిర్వహించారు. శ్రావణ శోభతో వాడవాడలా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.

క్లుప్తంగా

'తాగునీరు అందించారు'



పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో తాగునీటి సరఫరా వద్ద మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో గత కొద్ది రోజులుగా నిలిచిపోయిన తాగునీటి సరఫరాను తిరిగి పునరుద్ధరించారు. ఈ నెల 14వ తేదీన సాక్షి దినపత్రిక జిల్లా పేజీలో ప్రచురితమైన 'కిడ్నీ ఆస్పత్రిలో నిలిచిన తాగునీటి సరఫరా' అనే కథనానికి స్పందించారు. పరికరాన్ని బాగు చేసి తాగునీటి సరఫరా పునరుద్ధరించారు.

ప్రభుత్వ మద్యం షాపులో చోరీ

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కేటీ రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజ్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో శుక్రవారం చోరీ జరిగింది. 14వ తేదీ రాత్రి దుకాణం మూసివేసిన సమయానికి కౌంటర్‌లో రూ.రెండు లక్షల పద్నాలుగు వేల ఐదువందలు ఉండేవని ఉద్యోగులు తెలిపారు. గురువారం స్వాతంత్ర్య దినోత్సవం సెలవు కారణంగా శుక్రవారం ఉదయం 11 గంటలకు తలుపులు తెరిచి చూడగా కౌంటర్‌లో కేవలం రూ.6,500 మాత్రమే నగదు మిగిలిందని తెలిపారు. దుకాణం వెనుక భాగం నుంచి తాళం పగులకొట్టి దొంగలు లోపలికి చొరబడి నగదు కాజేశారని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన వెంకటరమణ

సీతంపేట: ఐటీడీఏ ప్రాజెక్టు ఇన్‌చార్జి పీఓగా పాలకొండ ఆర్డీఓ వి.వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు పకడ్బందీగా అమలుచేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. విద్య, వైద్యం క్షేత్రస్థాయిలో ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'రాజీని ప్రోత్సహించండి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: కక్షిదారులు రాజీ అయ్యేందుకు ప్రోత్సహించి, రానున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేందు కు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. ఆయన శుక్రవారం జిల్లా కోర్టు భవనంలో పోలీసు, ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 14న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలన్నారు.

ఫిర్యాదు చేద్దామా



- సైబర్ మోసాలపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడం శ్రేయస్కరం
- 24 గంటల్లోగా కంప్లైంట్ రిజిస్టర్ చేస్తే మేలు

శ్రీకాకుళం క్రైమ్ : సైబర్ మోసాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. వీటి బారిన పడకుండా అప్రమత్తంగా ఉండడం ఎంత అవసరమో.. ఒకవేళ మోసానికి గురైతే ఫిర్యాదు చేయడం కూడా అంతే అవసరం. జిల్లావ్యాప్తంగా ఈ ఒక్క ఏడాది (2024) లోనే 1400కు మించి సైబర్ ఫ్రాడ్ ఫిర్యాదులు రాగా అందులో ఆన్‌లైన్ యాడ్ ఫ్రాడ్స్ సగానికి మించి ఉన్నాయి. పోలీసులు ఇలాంటి ఆన్‌లైన్ సైట్ల ప్రకటనల జోలికి వెళ్లి డబ్బులు పోగొట్టుకోవద్దని అప్రమత్తం చేస్తున్నారు.

ప్రత్యేకించి వెబ్‌సైట్..

ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారిన పడి మోసపోతే.. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయొచ్చు. 24 గంటలూ అందుబాటులో ఉండే ఈ వెబ్‌సైట్‌లో మోసం జరిగిన 24 గంటల్లో ఫిర్యాదు చేస్తే ఫలితం ఉంటుంది. మన అకౌంట్ నుంచి అవతలి వ్యక్తి ట్రాన్సాక్షన్‌లను (లావాదేవీలను) ట్రాక్ చేసేందుకు అధికారులకు వీలవుతుంది. మోసపోయామని గ్రహించిన వెంటనే సందేహించకుండా ఈ పోర్టల్‌లో రిపోర్ట్ చేయడం మంచిది.

ఫిర్యాదు చేద్దామిలా..

- ముందుగా హెచ్‌టీటీపీఎస్://సివైబిఇఆర్‌సిఆర్ ఐఎంఇ.జిఒవి.ఐఎన్ అనే పోర్టల్‌ను క్లిక్ చేసి హోమ్ పేజీలోకి వెళ్లి 'ఫైల్ ఎ కంప్లైంట్' ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.
- అక్కడ కొన్ని నియమాలు, షరతులు చూపిస్తుంది. వాటిని చదివి యాక్సెప్ట్ చేసి 'రిపోర్ట్ అదర్ సైబర్‌క్రైమ్' బటన్‌పై క్లిక్ చేయాలి.
- తర్వాత 'సిటిజన్ లాగిన్' ఆప్షన్ సెలెక్ట్ చేసి మీ పేరు, ఫోన్ నంబర్, ఈ–మెయిల్ వివరాలు ఎంటర్ చేస్తే రిజిస్టర్ మొబైల్ నెంబర్‌కు ఒక ఓటీపీ వస్తుంది.
- ఓటీపీ ఎంటర్ చేసి క్యాప్చా కోడ్‌ను బాక్స్‌లో ఫిల్ చేసి సబ్మిట్ బటన్ నొక్కాలి. తర్వాత పేజీలోకి తీసుకెళ్తుంది. అసలు ప్రక్రియ మొదలయ్యేది ఇక్కడే.
- ఈ పేజీలో ఒక ఫారం కనిపిస్తుంది. దానిలో మనకు జరిగిన సైబర్ మోసం గురించి రాయాలి. కాకపోతే నాలుగు సెక్షన్లుగా విభజించి ఉంటుంది. సాధారణ సమాచారం (జనరల్ ఇన్ఫర్మేషన్), బాధితుల సమాచారం (విక్టిమ్ ఇన్ఫర్మేషన్), సైబర్ నేరానికి సంబంధించి సమాచారం (సైబర్ క్రైమ్ ఇన్ఫర్మేషన్), ప్రివ్యూ అనే సెక్షన్లు ఉంటాయి.
- ప్రతి సెక్షన్‌లో అడిగిన వివరాలను సమర్పిస్తూ ప్రక్రియను పూర్తి చేయాలి. మూడు సెక్షన్లు పూర్తయ్యాక ప్రివ్యూను వెరిఫై చేయాలి. అన్ని వివరాలు సరిగా ఉన్నాయని భావిస్తే సబ్మిట్ బటన్ క్లిక్ చేయాలి.
- తర్వాత ఘటన ఎలా జరిగిందనే వివరాలు నమోదు చేయాలి. నేరానికి సంబంధించిన స్క్రీన్ షాట్లు (అకౌంట్ ట్రాన్సాక్షన్ తదితర), ఫైల్స్ వంటి ఆధారాలు, సాక్ష్యాలు అందులో పొందుపర్చాలి. వివరాలు సేవ్ చేసి నేరగాళ్ల గురించి ఏదైనా సమాచారం తెలిస్తే ఫిల్ చేయాలి.
- అంతా వెరిఫై చేసుకున్నాక సబ్మిట్ బటన్ క్లిక్ చేస్తే కన్ఫర్మేషన్ మెసేజ్ వస్తుంది. కంప్లైంట్ ఐడీతో పాటు ఇతర వివరాలతో కూడిన ఈ–మెయిల్ వస్తుంది. తర్వాత అధికారులు దర్యాప్తు ప్రారంభిస్తారు.

1930 ఇలా పనిచేస్తుంది..

1930 నంబర్‌కు మోసపోయిన తక్షణమే కాల్ చేస్తే అక్కడి కాల్‌సెంటర్‌లో పనిచేసే సిబ్బంది అన్ని బ్యాంకులు యూపీఐ వ్యాలెట్లకు సంబంధించి ప్రతినిధులు, అధికారులను నేరుగా సంప్రదిస్తారు. బాధితుని లావాదేవీల వివరాలన్నీ తీసుకుని ఏ బ్యాంకు ఖాతా నుంచి డబ్బు పోగొట్టుకున్నాడో తెలుసుకుని ఆ బ్యాంకు నోడల్ అధికారికి సమాచారమిస్తారు. బాధితుని ఖాతాను పరిశీలించి అందులో సొమ్ము ఏ ఖాతాకు బదిలీ అయ్యిందో గుర్తించి సంబంధిత అధికారికి సమాచారమిస్తారు. ఎవరైతే మోసగించి తమ ఖాతాలో డబ్బులు వేసుకుంటారో వారి ఖాతాను సంబంధిత బ్యాంకువారు ఫ్రీజ్ చేస్తారు. అంతేకాక బాధితుని ఖాతాలో లావాదేవీలన్నీ బ్లాక్ చేస్తారు. ఈ క్రమంలో నేరగాళ్లు కొట్టేసిన డబ్బు ఏదో ఒక బ్యాంకులో ఫ్రీజ్ అయ్యి ఆ ఖాతా వివరాల ఆధారంగా మోసం చేసినవారిని గుర్తించే వీలుంటుంది. ఒకవేళ అకౌంట్ ఫ్రీజ్ చేసేలోగా నగదును మోసగాళ్లు విత్‌డ్రా చేస్తే నగదు బదిలీ అయిన విధానం, బ్యాంకులు ఇచ్చే సాంకేతిక ఆధారాల సాయంతో నేరస్తులను పోలీసులు పట్టుకోవడానికి సులభమవుతుంది.

కచ్చితంగా సంప్రదించాల్సిందే..

పైన పేర్కొన్న విధానమంతా చేసినా కూడా.. బాధితుడు కచ్చితంగా తన ఖాతా కలిగిన సంబంధిత బ్యాంకుకు వెళ్లి ప్రతినిధులను సంప్రదించి ఫిర్యాదు చేయాలి. దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలి. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్న సైబర్ సెల్‌ను కూడా సంప్రదించాలి.

సైబర్ నేరాలపై దృష్టి: ఎస్పీ



సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు

శ్రీకాకుళం క్రైమ్: సైబర్ నేరాలపై బాధితులు ఫిర్యాదు చేసిన తక్షణమే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు అధికారులకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అపరిష్కృతంగా ఉన్న కేసులపై దృష్టి కేంద్రీకరించి వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో పెండింగ్, ఎన్డీపీఎస్ మద్యం, మిస్సింగ్, ప్రాపర్టీ, గ్రేవ్, సైబర్ వంటి నేరాలకు సంబంధించి కేసులపై ఎస్పీ నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసుల్లో నిశితమైన సాక్ష్యాధారాలతో సమగ్ర దర్యాప్తు చేసి చార్జిషీటు కోర్టులో దాఖలు చేయాలని, హోంగార్డు, పీసీల నుంచి డీఎస్పీ స్థాయి వరకు తప్పనిసరిగా గ్రామ సందర్శనలు చేసి ప్రజలతో మమేకమై సమస్యలు గుర్తించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను గుర్తించి ముందస్తుగా బైండోవర్ చేయాలన్నారు.

గంజాయి నియంత్రించాలి..

గంజాయి నియంత్రణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఇలాంటి కేసుల్లో అరెస్టయిన నిందితుల నుంచి వారికి అమ్మిన, సరఫరా చేసిన వ్యక్తుల సమాచారాన్ని సేకరించి, ఆయా కేసుల్లో వారిని నిందితులుగా చేర్చాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. జైలు నుంచి విడుదలైన ముద్దాయిలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరాల్లో ఫిర్యాదుదారుడు ఇచ్చిన వివరాల మేరకు దర్యాప్తు వేగవంతం చేయాలని, ప్రజలకు తక్షణమే ఫిర్యాదు చేసేలా (ఆన్‌లైన్ పోర్టల్, డయల్ 1930, పరిధి పీఎస్‌లో ఎఫ్ఐఆర్ నమోదు, ఖాతా కలిగిన బ్యాంకు ప్రతినిధులతో సంప్రదింపు) అవగాహన కల్పించాలన్నారు. పాత నేరస్తుల కదలికలపైనా దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ డాక్టర్ ప్రేమ్‌కాజల్, డీఎస్పీలు శృతి, బాలచంద్రరెడ్డి, త్రినాథరావు, శ్రీనివాసరావు, ఏవో గోపినాథ్, లీగల్ అడ్వైజర్ హేమని, సీసీ శివకుమార్, పీఆర్వో భాస్కర్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

'వంశధార పనులు వేగవంతం చేయాలి'



హిరమండలం ఎత్తిపోతల పథకం పనులను పరిశీలిస్తున్న సీఈ సుగుణాకర్

హిరమండలం: వంశధార రిజర్వాయర్ పనులు, ఎత్తిపోతల పథకం పనులు వేగవంతం చేయాలని ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ ఎస్.సుగుణాకర్ అన్నారు. వంశధార రిజర్వాయర్ (బీఆర్ఆర్ ప్రాజెక్టు) స్పిల్‌వే వద్ద జరుగుతున్న పనులతో పాటు జలాశయం నీటితో నింపేదుకు చేపడుతున్న ఎత్తిపోతల పథకం పనులను వంశధార ఎస్ఈ బి.రాంబాబు, డీఎస్ఏ స్వర్ణకుమార్‌లతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ వద్ద జరుగుతున్న కాంక్రీట్, మట్టి పనులతో పాటు స్పిల్‌వే పనుల ప్రగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల వేగవంతానికి పలు సూచనలు చేశారు. అలాగే విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు కూడా పూర్తిస్థాయిలో చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. పూర్తిస్థాయిలో పనులు 2025 జూన్ నాటికి పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. గడువు నాటికి పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వంశధార కట్టడాల విభాగం ఈఈ ఎంవీ రమణ, డీఈఈ లు రవికాంత్, సురేష్, రవీంద్ర, ఏఈలు వినోద్, విశ్వనాథం, సోమ, రాఘవ కన్‌స్ట్రక్షన్ ప్రతినిధులు వంశధార సిబ్బంది ఉన్నారు.

వీధుల్లోకి హడ్డుబంగి గెడ్డ నీరు



నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల రెల్లివీధిలోకి చొరబడిన హడ్డుబంగి గెడ్డ వరద నీరు

కొత్తూరు: హడ్డుబంగి గెడ్డ పరివాహక ప్రాంతాల్లో భారీగా వర్షం కురవడంతో గెడ్డకు వరద నీరు పోటెత్తింది. దీంతో కొత్తూరులోని గెడ్డకు ఆనుకుని ఉన్న రెల్లివీధి, కుమ్మరవీధి కాలనీల్లోకి నీరు వచ్చేసింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. హడ్డుబంగి గెడ్డలో పేరుకు పోయిన పూడికలను నీటిపారుదల శాఖ అధికారులు తొలగించక పోవడంతో గెడ్డనీరు వీధుల్లోకి వచ్చేస్తోంది. వైఎస్సార్‌సీపీ నాయకులు కొత్తూరు సర్పంచ్ పడాల కృష్ణవేణి, పడాల లక్ష్మణరావులు గెడ్డలో కొంత వరకు పూడికలను ఇటీవటే తొలగించారు. దీంతో సాగునీరు అందుబాటులోకి వచ్చింది. ఇప్పటికైనా నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి గెడ్డలో పూడికలు, ఆక్రమణలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



రంపఖానా గ్రామం వద్ద రహదారిపైన నీటిలో పడి ఉన్న విద్యుత్ తీగలను చూపుతున్న గ్రామస్తులు

మెళియాపుట్టి: మండలంలోని రంపఖానా చిన్న హంస గ్రామాలకు మధ్య టెక్కలిపట్నం వెళ్లే ముఖ్య రహదారిలో శుక్రవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు నాలుగు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రహదారికి అడ్డంగా విద్యుత్ తీగలు పడిపోయాయి. అయితే ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని అక్కడి ప్రజలు చెబుతున్నారు. వెంటనే స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. విద్యుత్ తీగలు రహదారికి అడ్డంగా పడిపోవడంతో చుట్టు పక్కల సుమారు 10 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు మరమ్మతు చర్యలు చేపట్టారు.

'1108 జీఓ రద్దు చేయాల్సిందే'



మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు


సంతబొమ్మాళి: కాకరాపల్లి థర్మల్ ప్రాజెక్టు కోసం వేలాది ఎకరాల తంపర భూములను ఏపీఐఐసీకి కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 1108ను రద్దు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి తాండ్ర ప్రకాష్ డిమాండ్ చేశారు. థర్మల్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా మండలం వడ్డితాండ్రలో చేపడుతున్న నిరవధిక నిరాహార దీక్షలు 15 ఏళ్లకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శిబిరం వద్ద నిర్వహించిన సభలో తాండ్ర ప్రకాష్ మాట్లాడుతూ ఉద్యమకారులపైన, ప్రజలపైనా అక్రమంగా బనాయించిన పోలీసు కేసులన్నీ ఎత్తివేయాలని, ఏపీఐఐసీకి కేటాయించిన భూములను లీజుదారులైన మత్స్యకారులకు పంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర పోరాట సమితి కన్వీనర్ సన్నశెట్టి రాజశేఖర్ మాట్లాడుతూ చిత్తడి నేలల పరిరక్షణ కోసం సమరశీల పోరాటాల్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. 1108జీవో రద్దును కోరుతూ 5110 రోజులుగా వడ్డితాండ్రలో నిరవధికంగా సాగుతున్న దీక్షలు దేశ చరిత్రలోనే నిలిచిపోయాయని, దీక్షలు ప్రారంభమై నేటికి 14 ఏళ్లు పూర్తవుతున్నా పాలకుల్లో ఎలాంటి స్పందన లేదని సన్నశెట్టి విమర్శించారు. 2010 ఆగస్టు 15 నుంచి నిరవధికంగా కొనసాగుతున్న నిరాహార దీక్షలు ఇప్పటికీ కొనసాగడం ఎంతో పోరాట ఉత్తేజాన్ని నింపుతుందన్నారు.

కన్నమ్మ @115



కన్నమ్మ.. అని అడిగితే చాలు కొఠారి చుట్టుపక్కల గ్రామాల ప్రజలంతా ఠక్కున ఆమె ఇంటిని చూపిస్తారు. ఇక్కడ ఆమె అంటే తెలియని వారంటూ ఎవరూ లేరు. అవును.. మరి ఒకటా రెండా వందేళ్లకుపైగా ఆ గ్రామాలకు ఆమె పరిచయం. శుక్రవారానికి ఆమెకు 115 ఏళ్లు పూర్తయ్యాయి. ఒకప్పటి ఉమ్మడి తెలుగు రాష్ట్రం బరంపురంలో పుట్టిన కన్నమ్మకు తన 14వ ఏటనే కొఠారికి చెందిన కన్నయ్యతో వివాహమైంది. 4వ తరగతి వరకు చదువుకున్న కన్నమ్మ ఇంటి వద్దనే చిన్నపాటి పూరి గుడిసెలో కిళ్లీ బడ్డీ పెట్టుకునేది. గ్రామంలో ఎవరికైనా ఉత్తరాలు వచ్చినా, రాయాలన్నా కన్నమ్మ వద్దకు వచ్చి చదివించుకోవడం, రాయించుకునే వాళ్లంట. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు పుట్టిన తరువాత భర్త మృతి చెందడంతో పిల్లల్ని సాకుతూ వారిని పెళ్లిళ్లు చేసింది కన్నమ్మ. ఇప్పుడు ఆమె మునిమనవళ్ల పిల్లలకు పుట్టిన పిల్లలను సైతం చూస్తోంది. ప్రస్తుతం ఆమె కుమారుడి వద్దనే ఉంటోంది. శుక్రవారం ఆమెకు 115 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక సర్పంచ్ దుక్క ధనలక్ష్మీ, వైఎస్సార్ సీపీ నాయకుడు దుక్క ఆనంద్‌తో పాటు యువకులు ఆమెను సత్కరించి, ఆమె చేత పుట్టిన రోజు కేక్ కోయించారు.

– ఇచ్ఛాపురం రూరల్



శతాధిక వృద్ధురాలిని సత్కరిస్తున్న సర్పంచ్ దుక్క ధనలక్ష్మీ

సాఫ్ట్‌బాల్ స్టేట్‌మీట్‌కు సర్వం సిద్ధం

- నేటి నుంచి 11వ ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్
- శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానం వేదికగా 3రోజులపాటు జరగనున్న పోరు



క్రీడా మైదానంలో ఏర్పాట్లపై సమీక్షిస్తున్న నిర్వాహకులు, వివిధ కమిటీల ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా ఆతిథ్యంలో శనివారం నుంచి మొదలయ్యే సాఫ్ట్‌బాల్ స్టేట్‌మీట్‌కు సర్వం సిద్ధమైంది. శ్రీకాకుళం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నుంచి 19వ తేదీ వరకు 11వ ఏపీ రాష్ట్రస్థాయి (అంతర్ జిల్లాల)జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్–2024 పోటీలు జరగనున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్)కళాశాల మైదానం వేదికగా మూడు రోజులపాటు జరిగే ఈ పోటీల నిర్వహణను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర చైర్మన్ కలిదిండి నరసింహరాజు, జిల్లా కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మీదేవి, కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు, జిల్లా చైర్మన్ బడగల హరిధరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి మొజ్జాడ వెంకటరమణ, మెట్ట తిరుపతిరావు, ఒలింపిక్ సంఘం నాయకులు ఎం.సాంబమూర్తి, పి.సుందరరావు మాస్టారు, ఎస్.సూరిబాబు, గ్రిగ్స్ సెక్రటరీ బీవీ రమణ, డీఎస్‌డీఓ శ్రీధర్‌రావు తదితరులు ఏర్పాట్లను సమీక్షించారు. పోటీలు జరగనున్న శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానాన్ని సుందరంగా ముస్తాబు చేశారు.

జిల్లాకు చేరుకున్న క్రీడాజట్లు..

పోటీల కోసం రాష్ట్రం నలుమూలల నుంచి క్రీడా జట్లు ఇప్పటికే జిల్లా చేరుకున్నాయి. కర్నూలు, నెల్లూరు, గుంటూరు, కృష్ణ, వైఎస్సార్ కడప, ఉభయగోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం తదితర జిల్లాల క్రీడాకారులు ఇప్పటికే జిల్లాకు చేరుకున్నారు. ఉమ్మడి 13 జిల్లాల నుంచి క్రీడాకారులు, కోచ్, మేనేజర్లు కలిపి 496 మంది ఈ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొననున్నారు. వీరితోపాటు రిఫరీలు, టెక్నికల్ అఫీషియల్స్, స్థానిక పీడీ, పీఈటీలు, రాష్ట్ర, జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘ ప్రతినిధులు, వలంటీర్లు కలిపి 650 మంది హాజరుకానున్నట్లు నిర్వహణ కమిటీ నాయకులు కె.వెంకటరామరాజు, ఎంవీ రమణ పేర్కొన్నారు.

వసతి, భోజన ఏర్పాట్లు ఇలా..

వీరికి స్థానికంగా వసతి సదుపాయాలు కల్పిస్తున్నారు. పోటీలు జరుగుతున్న మైదానం వద్ద కళాశాల బాలుర వసతి కేంద్రం సమీపంలో భోజన సదుపాయాలు కల్పిస్తున్నారు. అయితే ఆకాశం మేఘావృతమై ఉండటంతో నిర్వాహకులు ఒకింత టెన్షన్‌కు గురవుతున్నారు. పోటీల ప్రారంభోత్సవానికి కార్యక్రమానికి రాష్ట్రమంత్రి కె.అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, సాఫ్ట్‌బాల్ రాష్ట్రసంఘ నాయకులు హాజరుకానున్నారు.

విజయవంతం చేయాలి



శ్రీకాకుళం ఆతిథ్యంలో స్టేట్ సాఫ్ట్‌బాల్ మీట్ పోటీలు జరగడం ఇది ఆరోసారి. ఇప్పటి వరకు జరిగిన అన్ని మీట్‌లను గ్రాండ్ సక్సెస్ చేశాం. కొంతమంది దాతలు సహకరించారు. అందరూ సహకరించి పోటీలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– మొజ్జాడ వెంకట రమణ, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి

అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం



జిల్లా కేంద్రంలో నేటి నుంచి మొదలయ్యే రాష్ట్రస్థాయి జూనియర్స్ స్టేట్‌మీట్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. గత కొన్ని రోజులుగా టోర్నీ కోసం వివిధ కమిటీలను వేసి పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం. నాణ్యమైన భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తున్నాం.

– కలిదిండి నరసింహరాజు, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్, జిల్లా అధ్యక్షుడు